క్యాలెండర్ అందజేత: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం రాష్ట్ర స్టూడెంట్ సామాజిక అర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఆయన వెంట రఘు ముదిరాజ్,సంపత్‌కుమార్‌లు ఉన్నారు. – బండ్లగూడ,జనవరి 10

నేడు విద్యుత్ ఉండని గ్రామాలు

శంషాబాద్ రూరల్ : నేడు వివిధ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శంషాబాద్ విద్యుత్‌శాఖ ఏఈ షేక్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని చిన్నగోల్కొండ ఫీడర్ 11 కేవీ పరిధిలోని చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, హమిదుల్లానగర్, రషీద్‌గూడ,సంఘీగూడ,బహదూర్‌గూడ, రాయికుంట, అక్బర్‌ఫామ్స్ ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులతో పాటు తీగల కింద ఉన్న చెట్ల తొలగింపు కోసం సరఫరా నిలిపివేస్తామని అందుకోసం ప్రజలు సహకరించాలన్నారు.

రెండ్రోజుల పాటు ఉచిత
ప్లాస్టిక్ సర్జరీ పరీక్షలు

కంటోన్మెంట్, జనవరి 10: ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్‌లోని లయన్స్ క్లబ్ దవాఖానలో ఈ నెల 17, 18 తేదీల్లో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు రాంకీ ఫౌండేషన్ చైర్మన్ మువ్వా రాంరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్ ప్రతినిధి విద్యాభూషణ్, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సెక్రటరీ సందీప్ హరి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో గ్రహణం మొర్రి, గ్రహణం ఆంగులీకం, కాలిన గాయాలతో బాధపడేవారికి, చేతులు, వాటి వేళ్లు, గొంతు అతుక్కొని ఉన్న వారికి ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్లాస్టిక్ సర్జరీ అవసరాలను అంచనా వేసేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్జరీ చేయించుకోవాలనుకునే వారు 9908630301, 9848241640 లో సంప్రదించాలని సూచించారు. ఈ శిబిరంలో డాక్టర్లు భవానీప్రసాద్, సుదర్శన్‌రెడ్డి వారి సిబ్బందితో చికిత్సలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

'పది' విద్యార్థులకు.. ప్రత్యేక తరగతులు

- రెండు విడతల్లో మోడల్ పరీక్షలు
- జనవరి నుంచి స్పెషల్ రివిజన్ టెస్ట్‌లు
- మార్కులు తక్కువ వచ్చిన వారిపై స్పెషల్ ఫోకస్..
- భయం పోగొట్టేందుకు ప్రతివారం పరీక్షలు



యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో రివిజన్ క్లాసులతో పరీక్షలకు సిద్ధం అవుతున్న పదో తరగతి విద్యార్థులు

జూబ్లీహిల్స్,జనవరి 10 : పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో ఉన్న అపోహలను తొలగించి.. పరీక్షలపై భయం పోగొట్టేందుకు రెండు విడుతలుగా మోడల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఎస్‌సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌కు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ ప్రాక్టీస్ పేపర్ పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ పేపర్ పరీక్షలు నిర్వహించాలని ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు.. ఫిబ్రవరి 15 నుంచి 22 వరకు రెండు విడతల్లో మోడల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రైవేట్‌కు ధీటుగా ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు డిసెంబర్ 31 వరకు సిలబస్ పూర్తిచేసిన ఉపాధ్యాయులు జనవరి నుంచి ప్రతిరోజూ స్పెషల్ రివిజన్ క్లాసులతో పాటు ప్రతివారం స్పెషల్ రివిజన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మార్చి 21 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు ప్రతి సబ్జెక్ట్‌లో పరీక్షలు నిర్వహించి తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఖైరతాబాద్ జోన్‌లోని 17 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నారు. ఖైరతాబాద్–2 మండలంలోని యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు జోన్‌లోని అన్ని పాఠశాలల్లో మోడల్ పరీక్షలు ఎలా రాయాలన్న దానిపై తర్ఫీదునిస్తూ ఎస్ఎస్‌సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌కు విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు.

పరీక్షలపై భయం పోగొట్టేందుకు..

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టేందుకు ప్రతివారం ఆయా సబెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం జిల్లావిద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో డిసెంబర్ 31 వరకు సిలబస్ పూర్తి చేశాం. రివిజన్ టెస్ట్‌లలో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నాము. దీంతో మరో రెండు నెలల సమయం ఉండగానే వారిని వార్షిక పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సంసిద్ధులను చేస్తాము.

– శామ్యూల్‌రాజ్,డిప్యూటీ డీఈఓ

హెచ్ఎంపీవీ కొత్త వైరస్ కాదు

ఖైరతాబాద్, జనవరి 10: హెచ్ఎంపీవీ అనేది కొత్త వైరస్ కాదని, దశాబ్దాల క్రితం నుంచే ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హెచ్ఎంపీవీ వైరస్ అంశంపై వైద్య నిపుణులు, సామాజికవేత్తలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజికవేత్త డాక్టర్ వీవీ రావు మాట్లాడుతూ కొవిడ్ లాంటి విపత్తుల సమయంలో వైద్యం అంటే వ్యాపార కోణంలో చూడకుండా మానవతా కోణంలో చూడాలన్నారు. నేడు వ్యాధులకు పదే పదే ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదని, మన వంటిళ్లే ఒక వైద్యశాల అని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే నిండు జీవితాన్ని గడపవచ్చన్నారు. డాక్టర్ రమేశ్ చౌహాన్ మాట్లాడుతూ 1960 నుంచే కరోనా వైరస్ గురించి తెలిసిందన్నారు. మానవుడు చేసే తప్పిదాల వల్ల ప్రకృతిలో మార్పులు వచ్చి వైరస్ ప్రాణాంతకంగా మారాయన్నారు. హెచ్ఎంపీవీ వైరస్‌ను 2001లో నెథర్లాండ్స్‌లో కనుకొన్నారని, అది పక్షుల ద్వారా వచ్చిందన్నారు. ప్రస్తుతం ఈ వైరస్‌తో భయపడాల్సిన అవసరం లేదని, రోగ నిరోదకశక్తి పెంచే ఆహారాన్ని తీసుకుంటే వైరస్ సోకదన్నారు. ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ వైద్య నిపుణులు డాక్టర్ సక్సెనా,రిటైర్డ్ డీఎం అండ్‌హెచ్‌వో, మహావీర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఆవులప పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడండి



జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిత్తల్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మణికొండ, జనవరి 10 : వచ్చే వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలకు ముందస్తుగా తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దూళిపాళ సీతారం ఆధ్వర్యంలో జలమండలిశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిత్తల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ ప్రజల అవసరం మేరకు మంచినీటి సరఫరా లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రాబోయే ఎండాకాలంలో నీటి ఎద్దడి తట్టుకొని పరిస్థితులకు తగ్గట్టుగా నీటి సరఫరా, ట్యాంకర్లను ఏర్పాటు చేసుకోవాలని విన్నవించారు. ఖిజ్రా కాలనీ, గోల్కొండ హిల్స్, నెక్నాంపూర్, నెమలినగర్ తదితర ప్రాంతాలలో నీటి సరఫరా పైప్‌లైన్లు పూర్తిగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు నేతలు తెలిపారు. అల్కాపూర్ స్పోర్ట్స్ పార్క్‌లోని 2.5ఎం. ఎల్.డి, కృష్ణారెడ్డి నగర్‌కాలనీలోని 0.5 ఎం.ఎల్.డి సామర్థ్యం గల రిజర్వాయర్‌లు నిరుపయోగంగా ఉన్నాయని అధికారుల దృష్టి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధన్‌రాజు, నరేందర్, లక్ష్మణ్‌రావు, విఠల్, ఉపేంద్రనాథ్ రెడ్డి, శ్రీకాంత్, ఆరీఫ్, మహమ్మద్ అశ్వక్, అలీ, సుమ, నళిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటాలంటే..అరచేతిలో ప్రాణాలు

జాతీయ రహదారిపై ఆందోళన చేసిన గగన్‌పహాడ్ గ్రామస్తులు

గగన్‌పహాడ్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 10: గగన్‌పహాడ్ రహదారిపై రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అధికారులను కోరిన ఏ ఒక్కరు స్పందించడం లేదని గ్రామస్తులు శుక్రవారం బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ బెంగళూరు జాతీయ రహదారి గగన్‌పహాడ్ రోడ్డుపై ప్రతినిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఘటనా స్థలానికి చేరుకొని అధికారులతో మాట్లాడి బ్రిడ్జి పనులు మొదలయ్యే విధంగా చూస్తామని పోలీసులు గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సరికొండ వెంకటేష్, శీలం తిరుపతిరెడ్డి, జోగి రవి, వి.నాగేష్, శ్రీధర్ గౌడ్, రత్నం, బాబుజీ, ప్రవీణ్, శీలం జగన్మోహన్‌రెడ్డి, గండయ్య, దేవుడు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పలు తీర్మానాలు

బడ్జెట్ సమావేశం అనంతరం సమావేశంలో తీసుకున్న పలు తీర్మానాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ తదితరులు

- చివరి సమావేశంలో రూ.43.71లతో తీర్మానాలు
- సగానికిపైగా బకాయిల చెల్లింపులకే
- డిమాండ్ బడ్జెట్ వసూళ్లను దృష్టిలో పెట్టుకొని కేటాయింపులు

మణికొండ, జనవరి 10 : అభివృద్ధే లక్ష్యంగా నిధులను కేటాయింపులు చేసి తీర్మానాలు చేపట్టామని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ చివరి కౌన్సిల్ సమావేశం ఆయన అధ్యక్షత నిర్వహించారు. రూ.43 కోట్లతో అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు చేశామని తెలిపారు. వీటిలో సీసీ రోడ్ల కొరకు రూ.5.78 లక్షలు, బీటీ రోడ్ల కోసం రూ.2.24లక్షలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాల కోసం రూ.2.95 లక్షలు, ఎల్క్ట్రికల్ పనుల కోసం రూ.55 లక్షలు, శ్మశానవాటికల్లో అసంపూర్తి పనుల కోసం రూ.36లక్షలు, కాంపౌండ్ వాల్ నిర్మాణాల కోసం రూ.55 లక్షలు,స్టోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణాల కొరకు రూ.17.6లక్షలు, ఇతర అభివృద్ధి పనుల కోసం 19.52 లక్షల నిధులతో చివరి సమావేశంలో కేటాయింపులు జరిగినట్లు వెల్లడించారు. తీర్మానం చేసిన నిధుల్లో రూ.33.30లక్షల బకాయిలు చెల్లించేందుకే వెళ్లే అవకాశముంది. అయితే వచ్చే ఏడాది డిమాండ్ బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని తీర్మానాలు జరిపామని కొంతమంది ప్రజాప్రతినిధులు అంటున్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ ప్రదీప్ కుమార్, డీఈ సాయికుమార్, ఏఈ సంజయ్, మేనేజర్ శ్రీధర్, వివిధ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గాయకుడు వినోద్‌బాబుకు పురస్కారం : దేశంలోనే గొప్ప నేపథ్య గాయకులలో ఒకరిగా ప్రముఖ గాయకుడు డాక్టర్ కె.జె. యేసుదాస్ గుర్తింపు పొందారని పలువురు వక్తలు అన్నారు. అన్ని భారతీయ భాషలో పాటలు పాడిన మహాగాయకుడు యేసుదాస్ అని కొనియాడారు. యేసుదాస్ 85వ జన్మదినం సందర్భంగా మా ఈవెంట్స్ సంస్థ,శ్రీరామ సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడి టోరియంలో ఆయన పాడిన పాటలతో స్వరరాగ ప్రవాహం కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రముఖ గాయకుడు వినోద్‌బాబుకు యేసుదాస్ పురస్కారం అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో మా ఈవెంట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీదేవి,కళా దర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు,ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. – హిమాయత్‌నగర్,జనవరి10:

రగ్గులు పంపిణీ: హెల్పీ నీడి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిమ్స్‌లోని డయాలసిస్ రోగులకు సమకూర్చిన రగ్గులను శుక్రవారం నెఫ్రాలజీ ప్రొఫెసర్లు డాక్టర్ గంగాధర్, డాక్టర్ శ్రీభూషణ్ రాజు, జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత, ప్రజా సంబంధాల అధికారి సత్యగౌడ్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం హెల్పీ నీడి సంస్థ సభ్యులు మనోహర్ బాబు, రాఘవులు, రఘునాథరావులకు నిమ్స్ కిడ్నీ రోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. –ఖైరతాబాద్.

ముగిసిన డిజిటల్ ఆవిష్కరణలపై జాతీయ సదస్సు

ఖైరతాబాద్, జనవరి 10 : డిజిటల్ ఆవిష్కరణలపై లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో అధ్యాపకులు, పరిశోధకులు సుమారు 38 పరిశోధన పత్రాలు సమర్పించారని, ఉత్తమ పరిశోధన పత్రాలకు బహుమతులు అందజేశామన్నారు. మొదటి బహుమతి డాక్టర్ కె. సువర్చల రాణి, డాక్టర్ అవిశ్విని, రెండో బహుమతి డాక్టర్ డి. సంజీవరావు, పి. కృష్ణి రెడ్డి, మూడో బహుమతి డాక్టర్ టి. పావని తదితరులకు అందజేశామన్నారు.

'గేమ్ చేంజర్ టికెట్ ధరలు తగ్గించాలి'

హిమాయత్‌నగర్,జనవరి10: గేమ్ చేంజర్ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం సరైన విధానం కాదని,తక్షణమే పెంచిన టికెట్ ధరలను తగ్గించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా విడుదలయ్యే సినిమాలకు టిక్కెట్ల ధరలను పెంచబోమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి మాట తప్పారని ఆరోపించారు.ఎవరి ప్రయోజనాల కోసం గేమ్ చేంజర్ సినిమాకు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారని వారు ప్రశ్నించారు.

ఫుడ్ ఫెస్టివల్: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ కళాశాలలో సంక్రాంతి పండగా సందర్భంగా శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల వంటకాలు, తినుబండారాలను తయారు చేసి కళాశాలలో స్టాలను ఏర్పాటు చేసి అమ్మాకాలు చేశారు.తినుబండారాలు అమ్మగా వచ్చిన డబ్బులను విద్యార్థులు అనాథ ఆశ్రమానికి ఇచ్చేందుకు నిర్ణచించినట్లు గౌరీ సతీష్ తెలిపారు.—బండ్లగూడ,జనవరి 10

ప్రజల ముందు నీతులు.. చేసేవి చిల్లర పనులు

కేటీఆర్‌పై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు

బోరబండ బస్ టెర్మినల్ సమీపంలోని బస్తీ దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రగడ్డ, జనవరి 10: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు, అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఇక ఆ పార్టీకి చెందిన గల్లీ స్థాయిలో ఉన్న వాళ్లు కేటీఆర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేయటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. శుక్రవారం బోరబండ బస్ టెర్మినల్ సమీపంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, సీనియర్ నేత విజయకుమార్ తదితరులు మాట్లాడారు. కేటీఆర్ కృషితో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు హైదరాబాద్ నగరానికి వచ్చిన విషయాన్ని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. బోరబండ సంపూర్ణ అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరిగి బంగారు బండగా రూపుదిద్దుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చొరవతో డివిజన్‌లోని వీకర్‌సెక్షన్ బస్తీలు సహా అన్ని ప్రాంతాలు మౌలిక వసతులకు నోచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఏడాది కాలంగా డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులమని చెప్పుకొంటున్న వాళ్లు బోరబండకు చేసింది శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రమేష్‌యాదవ్, అజయకుమారి, లడ్డు, బొట్టుశివ, డేవిడ్, పద్మ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి 'స్వామి వివేకానంద'

నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌లో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న నరేష్‌రెడ్డి

మహావీర్ కళాశాలలో నిర్వహించిన వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సంస్కృతి ఫౌండేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎల్.ఎన్.మూర్తి

హిమాయత్‌నగర్,జనవరి10: ఆదర్శ సమాజ నిర్మాణానికి వివేకానంద బోధనలు ఎంతో ఉపకరిస్తాయని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి,సౌత్ సెంట్రల్ రైల్వే సీఓఎస్ లావణ్య రెడ్డి అన్నారు.శుక్రవారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌లో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా యువ దినోత్సవ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎంచుకునే మార్గం అత్యంత కీలకమైందని,గమ్యం చేరే సమయంలో ఎన్నో ఒడిదుడుకులు, సమస్యలు వచ్చిన వాటిని అధిగమించి ఆత్మ విశ్వాసంతో అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.యువజన ఉత్సవంలో భాగంగా నిర్వహించిన పలు పోటీ లలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేఎంఈఎస్ ఉపాధ్యక్షుడు జె.నరసింహారావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం,డైరెక్టర్ నాగేశ్వరరావు,డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వి.శాంతి,లా కాలేజీ ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు సమాజానికి ఆదర్శం

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మహావీర్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి ఫౌండేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎల్.ఎన్.మూర్తి హాజరై వివేకానందుడి బోధనలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ మధుసుధన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్రపాటిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మానస (ఫైల్)

శంషాబాద్ రూరల్, జనవరి 10 : కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహేశ్వరం మండలం నందిపల్లి గ్రామానికి చెందిన నర్సింహ రెండో కూతురు మానస(21) శంషాబాద్ పట్టణంలోని చైతన్య కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. రోజుమాదిరిగా శుక్రవారం కళాశాలకు వెళ్లిన ఆ యువతి సాయంత్రం 7 గంటల వరకు చూసినా ఇంటికి రాలేదు. దీంతో కళాశాలను సంప్రదించగా ఉదయం నుంచి కళాశాలకు మానస రాలేదని వివరించారు. దీంతో తండ్రి నర్సింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడలిని హత్యచేసిన
అత్త రిమాండ్

శంషాబాద్ రూరల్, జనవరి 10 : కోడలిని హత్యచేసిన అత్తను శుక్రవారం రిమాండ్‌కు తరలించిన్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నవంబర్‌లో శంషాబాద్ మండలంలోని రామంజాపూర్ తండాకు చెందిన ముడావత్ సురేష్ భార్య ధూలి(38) అదృశ్యమైన్నట్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన నేపథ్యంలో అనుమానం వచ్చిన సురేష్ తల్లి తులసిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. నవంబర్ 10న కోడలు ధూలి సాతంరాయిలో ఉన్న అత్త, మామల దగ్గరకు వచ్చింది. దీంతో అత్త, కోడల మధ్య గొడవ జరిగింది. దీంతో కల్లులో ఎలుకల మందు కలిపి తాగించి హత్యచేసి ఓ ఖాళీ ప్రదేశంలో పూడ్చిపెట్టినట్లు నేరం ఒప్పుకోవడంతో ఆమెను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు.

కారు ఇవ్వనందుకే....

ఖైరతాబాద్, జనవరి 10 : తనఖా పెట్టిన కారును ఇవ్వనందుకు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశాడు. పది రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని పంజాగుట్ట పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఏసీపీ మోహన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అమీర్‌పేటలోని ఎల్లారెడ్డిగూడ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ లేన్‌లో నివాసం ఉండే విష్ణు రూపాని (45) కిరాణ వ్యాపారి. గత నెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన విష్ణు ఈ నెల 1న ఎస్ఆర్‌నగర్‌లోని బుద్ధనగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో కుల్లిపోయిన దశలో శవమై క